
# బ్రహ్మభూతం

— జంధ్యాల సుబ్బలక్ష్మి



"ఇది గాలి చేష్టే. ఇందులో సందేహం లేదు" పరీక్షిత్‌ను పరీక్ష చేసి చెప్పాడుభూతవైద్యుడు.

అందరూ భయం భయంగా పరీక్షిత్ వంక చూశారు.

"ఎలాగైనా ఈ భూతాన్ని వదిలించి మావాణ్ణి కాపాడండి" చేతులు జోడించింది కామేశ్వరి.

"అందుకే గదమ్మా నా ప్రయత్నమంతా. ఇది మొండి భూతం. చాలా పూజలు చెయ్యాలి. చాలా రోజులు పడుతుంది. డబ్బు కూడా బాగానే ఖర్చవుతుంది" అన్నాడు భూతవైద్యుడు చివరి వాక్యాన్ని జాగ్రత్తగా ఉచ్చరిస్తూ. అతడికి డబ్బే ముఖ్యమయినా, కేవలం భూతాన్ని వదిలించే ప్రయత్నంలోనే డబ్బు ఖర్చు చెయ్యాలని చెప్తున్నాను అని ధ్వనించేట్లు.

"డబ్బు విషయం ఆలోచించకండి. పిల్లవాడు మామూలు మనిషైతే..." అని కామేశ్వరి అంటుండగానే-

"నాకే భూతమూ, దయ్యమూ పట్టలేదు. డబ్బు కొట్టెయ్యడానికి వాడు నాటకమాడుతున్నాడు. అది నిజమని నమ్మి నువ్వు మోసపోతున్నావు" అన్నాడు పరీక్షిత్.

"చూశారా చూశారా, మీ అబ్బాయిని పట్టిన భూతం ఎలా పలికిస్తోందో. నన్ను తరిమేసి తను ఇక్కడే తిష్ట వెయ్యాలని చూస్తోంది. దాని మాటలు నమ్మకండి" అన్నాడు భూతవైద్యుడు. "డబ్బు నేనేం చేసుకుంటానమ్మా. తింటానా. పూజ వస్తువులు, తాయెత్తులూ వాటి కోసమేగా"

"స్వామీ దయచేసి అలా మాట్లాడకండి. ఆ భూతం మాటలు పట్టించుకోకండి. డబ్బిచ్చేది నేను" అంది కామేశ్వరి.

"సరే. దినదినమూ పూజ తీవ్రతరం చేస్తాను. పదిహేను రోజుల జపాలు, హోమాలు చెయ్యాలి. నా శిష్యులు నలుగురు వస్తారు. నలుదిక్కులా బంధనం చెయ్యాలి. ఈ భూతానికి మిత్ర భూతాలు చాలానే ఉన్నాయి. అవి ఇక్కడికి రాకుండా చెయ్యాలి. చివరిరోజున తులం బంగారం హోమంలో వేసి మధ్యాహ్నానికల్లా ఆ బూడిదను ఏట్లో పారెయ్యాలి. అప్పటికి భూతం పూర్తిగా వదిలిపోయింది. ఆ తర్వాత ఆ పూజ చేసిన గదిలో పూచికపుల్లా, బూజు ముక్కా కూడా లేకుండా పూర్తిగా తుడవాలి. విలువైన వస్తువులు ఏవైనా వుంటే ఇప్పుడే దాచుకోండి. తర్వాత నన్ననవద్దు" అన్నాడు భూతవైద్యుడు.

కామేశ్వరి అలాగే నన్నట్లు తలూపింది. భూతవైద్యుడు వెళ్ళిపోయాడు.

"ఎందుకమ్మా అడ్డమైన వెధవల్నీ భూతవైద్యులంటూ రప్పించి వాళ్ళ మొహాన డబ్బు కొడతావు. తులం బంగారం కావాలట. వాళ్ళు చేసిందేముంది. వేప మండలతో ఒళ్ళు వాచేలా బాదడమేగా. చూడు. పదిరోజుల నుండీ వేప మండలతో బాది బాది ఒళ్ళంతా పుండ్లయి పోయింది" వీపు చూపించాడు పరీక్షిత్.

కామేశ్వరిలోని తల్లి మనసు బాధతో మూలిగింది. ఆ తల్లి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "అయ్యో మా నాయనే" అంటూ లోపలికి వెళ్ళి వెన్న తెచ్చింది గాయాలకు రాయడానికి. వెన్న చేతిలోకి తీసుకుని చెయ్యి చాచి ఆగిపోయింది. షాక్ కొట్టినట్లు చెయ్యి వెనక్కు తీసుకుంది.

పరీక్షిత్ తల్లి వంక అదోలా చూచి తల తిప్పుకున్నాడు.

దాదాపు నెలరోజుల క్రితం పరీక్షిత్ మేనమామ అంటే కామేశ్వరి అన్నగారైన కేదారేశ్వర్ ఆధ్వర్యంలో పూజా సప్తాహం ఒకటి జరిగింది. ఆ ఊరు సుమారు ఆరువందల కి.మీ. దూరంలో ఉంది. బస్సులు రాత్రిపూటే నడుస్తాయి అట్నుంచి ఇటైనా, ఇట్నుంచి అటైనా.

మేనమామగారి ఊరు వెళ్ళక ముందు బాగానే ఉన్నాడు పరీక్షిత్. కానీ అక్కడికి వెళ్ళాక పూజలు జరుగుతున్న సమయంలో మాత్రం విచిత్రంగా ప్రవర్తించసాగాడు.

మంత్రాలు చదువుతుంటే వినలేనట్లు ముఖం చిట్లించేవాడు. చెవులు మూసుకుని నెత్తి బాదుకునేవాడు. లేచి అవతలికి వెళ్ళిపోయేవాడు.

ఆ సప్తాహంలో ఒక్కోరోజు ఒక్కో రూపంలో దేవుడిని పూజించేవారు. ఆ రూపంలోనే దేవుడికి అర్చన, అభిషేకాలు, భజనలు, కీర్తనలు, ఊరేగింపూ అన్నీ జరిగేవి.

ఊర్లో ఐదోరోజు వరకూ పరీక్షిత్ పూజా కార్యక్రమం జరుగుతున్నప్పుడు మామూలుగానే ఉన్నాడు.

ఆరోరోజు దేవతకు పూజ జరుగుతోంది. ఉన్నట్లుండి పరీక్షిత్ ముఖం చిట్లించి పూజార్ల దగ్గరకెళ్ళి పూజలు ఆపండి. మంత్రాలు ఆపండి అని అరిచాడు.

పూజార్లకు ఏమీ అర్థం కాలేదు. ఒక చిన్నవాణ్ణి పంపి కేదారేశ్వర్‌ను తీసుకు రమ్మన్నారు. లోపల ఏవో ఏర్పాట్లు చేస్తున్న కేదారేశ్వర్ మండపంలోకి వచ్చాడు.

"ఈ అబ్బాయి ఎందుకో పూజ ఆపమన్నాడు. అర్థంకాక మిమ్మల్ని పిలిచాం" అన్నాడు పెద్ద పూజారి.

"ఏమిటయ్యా! నువ్విలారా... పూజ కానీ" అన్నాడు కేదారేశ్వర్.

"అది కాదు మామయ్యా మరి..."

"నువ్వేం మాట్లాడకు. మీరు కానివ్వండి" అంటూ వెళ్ళిపోయాడు కేదారేశ్వర్.

పరీక్షిత్ తనలో తానే గొణుక్కుంటూ కూర్చున్నాడు. పూజ జరుగుతున్నప్పుడు జుట్టు పీక్కుని, అటూ ఇటూ చూచి అక్కడి నుండి లేచి వెళ్ళిపోయాడు.

ఏడోరోజు సుప్రభాతం మొదలు అర్చన ప్రారంభమైంది. ఆ రోజు కూడా పరీక్షిత్ స్తోత్రాన్ని మధ్యలోనే ఆపమన్నాడు.

పూజార్లు అతడి మాటలు పట్టించుకోకుండా పూజను కొనసాగించారు.

చివరిరోజు. పొద్దున ప్రత్యేక పూజలేవీ లేవు. మామూలు పూజ చేశారు. సాయంకాలం భక్తి సంగీతం కార్యక్రమం జరిగింది. నలుగురు ప్రసిద్ధ గాయనీమణులు పాటలు పాడుతున్నారు.

కాసేపు విన్న తర్వాత ఒక పాట దగ్గర పరీక్షిత్ లేచి నిలబడ్డాడు.

"ఆపండి" అన్నాడు గట్టిగా.

పాట టక్కున ఆగింది.

"ఏమిటి మీరు పాడుతున్న పాట" అన్నాడు.

"కీర్తన" అందొకామె భయపడుతూనే.

"కీర్తన..." వెక్కిరింతగా అన్నాడు పరీక్షిత్.

"సిగ్గులేదూ మీకు మీరసలు ఆడవాళ్ళేనా" అన్నాడు.

"ఇంతకూ నువ్వెవరు?" అంది మరొకామె.

"ఇతను కేదారేశ్వర్ చెల్లెలి కొడుకు" అన్నాడు వెనక తంబుర మీటుతున్న వ్యక్తి.

"ఎవరైతే మాకెందుకు మమ్మల్ని ఇంత మాట అన్న తర్వాత ఇక్కడ ఉండం" అని నలుగురూ లేచి వెళ్ళిపోయారు. ఎవరు బ్రతిమాలినా వినలేదు. చివరకు కేదారేశ్వర్ వచ్చి చెప్పినా లాభం లేకపోయింది.

మంచి కార్యక్రమం రసాభాస అయినందుకు అందరూ బాధపడ్డారు.

కేదారేశ్వర్ ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

కామేశ్వరిని పిలిచి "ఇదుగో ఇది పల్లెటూరని, ఇక్కడ కొన్ని కట్టుబాట్లుంటాయనీ నీకు తెలుసు. కేవలం నా ముఖం చూసి మీ వాణ్ణి ఎవరూ ఏమీ చెయ్యలేదు. లేకుంటే ఇంత హీనంగా ప్రవర్తించి,

అ తి ధు ల న ం

పె ద్ద ల న హా

అవమానించినందుకు ప్రాణాలు తీసేవాళ్ళు. వెంటనే మీరిద్దరూ ఇక్కడి నుండి వెళ్ళకపోతే మీవాడి ప్రాణాలకు నేను జవాబు కాదు" అన్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. పూజల్లో ఇలా ప్రవర్తిస్తున్నాడంటే ఇదేదో దయ్యం పట్టినట్లు అనుమానంగా ఉంది. ఎవరైనా భూత వైద్యుడికి చూపించండి" అన్నాడు ఒక వృద్ధుడు.

దయ్యం పట్టిన పరీక్షిత్ వంక అందరూ భయంగానూ, కామేశ్వరి వంక జాలిగానూ, కేదారేశ్వర్ వంక అనునయంగానూ చూశారు.

కేదారేశ్వర్ దగ్గరుండి కామేశ్వరినీ, పరీక్షిత్‌ను వాళ్ళ ఊళ్ళో దించి వచ్చాడు.

అప్పట్నుంచే ప్రారంభమైంది పరీక్షిత్‌కు భూతవైద్యం.

కేదారేశ్వర్ కూతురు గాయత్రికీ పరీక్షిత్‌కూ పెళ్ళి చెయ్యాలనుకున్నారు మొదట్నుంచీ.

కానీ పరీక్షిత్‌కు దయ్యం పట్టినందువల్ల ఇక అతడు తన అల్లుడయ్యే అవకాశం లేదని చెప్పేశాడు కేదారేశ్వర్.

తనకు కావలసినంత డబ్బు దక్కిందాకా భూతవైద్యుడు పరీక్షిత్‌ను వేపమండలతో బాదిబాది, బంగారు కాసూ, ఘనంగా ఇతర వస్తువులూ చేజిక్కించుకుని వెళ్ళాడు. వెళ్తూ వెళ్తూ పరీక్షిత్‌ను పట్టిన భూతం శాంతించిందనీ, క్రమంగా బలహీనపడి వారంరోజుల్లో పూర్తిగా అతణ్ణి వదిలి పోతుందనీ చెప్పి వెళ్ళాడు.

భూతం బలహీనపడిందన్న మాట విని కామేశ్వరి సంతోషించింది. ధైర్యంగా కొడుకు దగ్గరికి వెళ్ళింది.

"నిన్ను పట్టిన భూతం చాలావరకూ వెళ్ళిపోయినట్లే. వారంరోజుల్లో నువ్వు మామూలు మనిషివవుతావని వైద్యుడు చెప్పాడురా" అంది సంతోషంతో.

పరీక్షిత్ పకపకా నవ్వాడు.

"దుకురా అలా నవ్వుతావు" అంది కామేశ్వరి భయంగా.

"మరి. నాకసలు భూతం పడ్తేగదా వదలడానికి" అన్నాడు పరీక్షిత్.

"భూతం పట్టలేదా? మరి నీ ప్రవర్తన..."

"ఏం తప్పుగా ప్రవర్తించానా?"

"పూజలు ఆపమనీ, కీర్తనలు పాడవద్దనీ..."

"అవును. ఆరోరోజు జరిగిన పూజలో మంత్రాలు నీకు గుర్తున్నాయా?"

"ప్చ్"

"సరే నేనే చెప్తాను" అని ఒక మంత్రం చదివాడు.

"దీనర్థం ఏమిటో తెలుసా?" అడిగాడు.

"ఏమిటి?"

నిఘంటువు తెచ్చి ఒక పదానికి అర్థం చూపించాడు.

"హవ్వ" నోరు నొక్కుకుంది కామేశ్వరి.

"మరునాడు సుప్రభాతంలోనూ అనేక పదాలు ఇలాగే ఉన్నాయి. చివరగా భక్తి సంగీతంలో పాడిన కీర్తనల్లో కూడా అర్థం తెలిసిన వాళ్ళకు ఇబ్బందిగా అన్పించే పదాలున్నాయి" "మరి అంతమంది పూజారులూ, పెద్దలూ, వాళ్ళకు అర్థం తెలియకే ఊరుకున్నారా. అర్థం తెలియకుండానే ఇన్నేళ్ళు బట్టీ చదువుతున్నారా?"

"అర్థం తెలియకపోవడమూ కావచ్చు. తెలిసినా భయం వలన కావొచ్చు"

"అయినా దైవానికి అశ్లీలత ఏమిటి? దేవుడి గురించి చెప్పినప్పుడు అపవిత్రమైన మాటలు కూడా పవిత్రమై పోతాయి" లెంపలు వేసుకుంది కామేశ్వరి.

"దేవుడి గురించి అపవిత్రమైన మాటలు రాశారంటే పవిత్ర భావనతోనే రాశారా? ప్రబంధాల్లో కూడా దేవుళ్ళ వ్యక్తిగత జీవితాలను పద్యాలుగా రాశారు. దేవుడికి మనుషులకూ తేడా లేనట్లు భావించి అంగాంగ వర్ణన చేశారు. భావం పవిత్రమైతే మాట కూడా పవిత్రమైనదే వస్తుంది. వీటన్నిటికీ కారణం అసలు ఇవి ఎవరు రాశారో తెలియకపోవడం. కొన్ని వందల సంవత్సరాల నుంచీ పరంపరగా వస్తున్నాయే కానీ, ప్రతివాళ్ళూ ఏ పదాన్ని విమర్శించినా దైవానికి అపచారం చేసినట్లవుతుందని అలాగే పెద్దవాళ్ళు చెప్పినట్లు మంత్రాలు, కీర్తనలు చదువుతున్నారు, పాడుతున్నారు.

"సినిమా సంభాషణల్లోనూ, వ్యాపార ప్రకటనల్లోనూ, యువ సాహిత్యంలోనూ అశ్లీలత ఉందని వాపోయే పెద్దలు వాళ్ళు పవిత్రంగా ఉచ్చరించే మంత్రాల్లోనే అశ్లీలత ఉందని గమనించరు. ఎవరైనా చెప్పినా నమ్మరు. నమ్మినా అంగీకరించరు. అదేమంటే సంప్రదాయం అంటారు"

"అయినా ఈ మంత్రాలన్నీ నువ్వు చిన్నప్పటినుంచీ వింటున్నవే కదా. మొన్న మొన్నటివరకూ మీ నాన్నగారు కూడా ఈ మంత్రాలను చదివేవారు కదా" అంది కామేశ్వరి.

"అప్పుడు వాటి అర్థం నాకూ తెలియదు. ఆరునెల్లుగా నేను సంస్కృతం నేర్చుకుంటున్నాను కదా. అందుకే అన్ని మాటలూ బాగా అర్థమవుతున్నాయి. అంతెందుకూ, ఇవే మంత్రాలు తెలుగులో రాసి చదివితే సామాన్యులు కూడా వీటిని విమర్శిస్తారు"

"అయితే ఇప్పుడేమంటావురా"

"అన్ని మంత్రాలనూ, స్తోత్రాలనూ, పాటలనూ ఒకసారి పరిశీలించి, అభ్యంతరకరమైన మాటలున్నచోట పవిత్రమూ, అర్థవంతమూ అయిన పదాలను చేర్చవలసి ఉంటుంది. అప్పుడు కనీసం మన తర్వాతి తరాల వారైనా పవిత్రంగా భగవంతుణ్ణి అర్చించగలుగుతారు"

అంతా విన్నాక కూడా ఛాందసభావాలున్న కామేశ్వరి కొడుకు వాదనతో ఏకీభవించలేకపోయింది.

అది గమనించిన పరీక్షిత్

"నీకింకా నా మాటలు బుర్ర కెక్కినట్లు లేదు. సరే... నువ్వన్నట్లు దేవుడి ముందు అపవిత్రాలన్నీ పవిత్రాలయిపోతే, చెప్పులు బయటే వదిలివెళ్ళడం ఎందుకు, ఆలయంలో ఉన్నప్పుడు మనస్సును కూడా పవిత్రంగా ఉంచుకోడానికి ప్రయత్నించడం ఎందుకు. మనం పవిత్రంగా ఉన్నప్పుడు, దేవాలయాన్ని పవిత్రంగా ఉంచినప్పుడూ, మంత్రాలలో కూడా ఆ పవిత్రత ఉండేలా చూడాలా వద్దా" అన్నాడు.

కామేశ్వరి ఆలోచనలో పడింది.

చప్పట్లు కొట్టిన ధ్వని వినిపిస్తే గుమ్మం వంక చూశారిద్దరూ. ఎప్పుడు వచ్చిందో గాయత్రి చప్పట్లు కొడుతూ పరీక్షిత్ వంక ప్రశంసగా చూస్తోంది.